క్లుప్తంగా

అమ్మాయాక్స్ సేవలు వెలకట్టలేనివి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: అమ్మాయాక్స్ మహిళా పరస్పర సహాయక పొదుపు సంఘం ద్వారా సంస్థ అధినేత దశరథరెడ్డి చేపడుతున్న సేవలు వెలకట్టలేనివని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలో ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో సంస్థ 65వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ విద్యను ప్రోత్సహించడానికి స్కాలర్‌షిప్‌లు, విద్యాసామాగ్రి వితరణ, ప్రభుత్వ ఆస్పత్రులు, పాఠశాలలకు, పోలీస్‌స్టేషన్లకు వస్తువులు వితరణ, హెల్త్ క్యాంపులతో సంస్థ మంచి పేరు తెచ్చుకుందని కొనియాడారు. ఏపీ మాస్ వినాయకరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, బైరెడ్డిపల్లి, వి.కోట ఎంఈఓలు సాయిలీలా, చంద్రశేఖర్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నేడు చెస్ టోర్నమెంట్

పుంగనూరు: పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్‌లో ఆదివారం 10 గంటలకు గురుకులం ఇంటర్ క్లబ్ ప్రొఫెనల్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం రుద్రాణి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ టోర్నమెంటులో గెలుపొందిన వారికి జూలై 2న రాష్ట్ర స్థాయి టోర్నమెంటు జరుగుతుందన్నారు. 14 మంది సభ్యులు పాల్గొనే ఈ టోర్నమెంటులో ఏడుగురు పుంగనూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన వారు కావడం గమనార్హమన్నారు.

బైక్ బోల్తా

గంగవరం: మండలంలోని చిన్నూరు ఫ్లైఓవర్ వద్ద బైక్ అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్‌ఐ ప్రతాప్ రెడ్డి కథనం మేరకు బంగారుపాళ్యం మండలం పాలూరు గ్రామానికి శంకర్(37) బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. బైక్‌పై బంగారుపాళ్యం నుంచి బెంగళూరు వైపు వెళ్తుండగా మార్గమధ్యలో చిన్నూరు ఫ్లైఓవర్ వద్ద అదుపుతప్పి బైక్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో శంకర తల, శరీర భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానికులు పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏఎస్‌డబ్ల్యూఓకు సన్మానం



పలమనేరు: పలమనేరు ఏఎస్‌డబ్ల్యూవో షకీలా గంగాధర నెల్లూరుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శనివారం పలమనేరు, గంగవరం మండలాలకు చెందిన సచివాలయ సంక్షేమ అసిస్టెంట్లు ఏఎస్‌డబ్ల్యూవో కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఇక్కడికి బదిలీపై పుంగనూరు నుంచి వచ్చిన నరసింహులుకు శుభాకాంక్షలు తెలిపారు.

వేలంతో రూ 4.33 లక్షల ఆదాయం

శాంతిపురం: గత ఎనిమిది ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న ట్రాక్టర్ల వేలం ద్వారా మండల పరిషత్‌కు రూ.4.33 లక్షల ఆదాయం సమకూరింది. శనివారంఎంపీడీవో హేమమాలిని ఆధ్వర్యంలో అధికారులు సచివాలయ ఆవరణలో ట్రాక్టర్లకు వేలం నిర్వహించారు. ఒక ట్రాక్టర్ రూ.1.30 లక్షలకు అమ్ముడుపోగా, అదనంగా రూ.23,400 జీఎస్టీ కింద వసూలు చేశారు. మరో ట్రాక్టర్ రూ.3.03 లక్షలకు అమ్ముడుపోగా, జీఎస్టీ కింద రూ. 54,540 వసూలు చేశారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయండి

పులిచెర్ల(కల్లూరు): మండలంలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శనివారం కల్లూరు జగనన్న కాలనీని ఆయన తనిఖీ చేశారు. లబ్ధిదారులకు పలు సూచనలు ఇచ్చారు. సర్పంచ్ షుకూర్, ఎంపీడీఓ సుగుణమ్మ, ఏఈ త్యాగరాజ, ఈఓ యుగంధర్ పాల్గొన్నారు.

నో పార్కింగ్ బోర్డుల వితరణ



నోపార్కింగ్ బోర్డులను ప్రారంభిస్తున్న సీఐ

పలమనేరు: పట్టణంలో ట్రాఫిక్ ఉన్న చోట ఏర్పాటు చేసేందుకు 19 నోపార్కింగ్ బోర్డులను పోలీసులకు స్థానిక సాయిరామ్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి డాక్టర్ యుగంధర్ శనివారం అందజేశారు. ఆయన సేవలను సీఐ చంద్రశేఖర్ ప్రశంసించారు.

రైతులకు న్యాయం చేస్తాం

బైరెడ్డిపల్లి : బెంగళూరు–చెన్నై రహదారి ఏర్పాటుతో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేస్తామని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. బైరెడ్డిపల్లె తహసీల్దార్ కార్యాలయంలో శనివారం రైతులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ భూములకు ఎకరాకు రూ.15 లక్షల వరకు పరిహారం చెల్లిస్తామన్నారు. ఇంటి స్థలాల లబ్ధిదారులకు చదరపు గజానికి రూ.2500 వరకు ఇస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పరంగా చెల్లించిన నగదును రైతులు స్వీకరించిన తరువాత ఆర్బిటేషన్ వేసుకుంటే అదనంగా చెల్లిస్తామని తెలిపారు. చట్టపరంగా రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

జగనన్న సురక్షతో అర్హులందరికీ లబ్ధి



పల్లెబాటలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

కుప్పం, గుడుపల్లె: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మంత్రిపెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం రెండవ రోజు గుడుపల్లె మండలంలో జరిగిన పల్లెబాట బహిరంగ సభల్లో ఆయన మాట్లాడారు. జగనన్న సురక్షా పథకం ద్వారా ఇంటి వద్దకే అధికారులు వస్తారని, సమస్యలను తెలియజేసి పరిష్కరించుకోవాలని తెలిపారు. అర్హులై ఉండి పథకాలు అందకుండా ఉంటే తగిన ధ్రువపత్రాలు అందిస్తే అందిస్తారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న బృహత్తర పథకమని పేర్కొన్నారు.

బీసీలకు బాబు చేసింది శూన్యం

రాష్ట్రంలోని 60 శాతం బీసీలకు చంద్రబాబు చేసింది శూన్యమని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. సొంత నియోజక వర్గం కుప్పంలోను వన్నెకుల క్షత్రియ, వాల్మీకి, కురబ కులాల కమ్యూనిటీ భవనాలు పూర్తి చేయని ఘనత బాబుదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుప్పంలోని ఓ వన్నెకుల క్షత్రియ మహిళకు కార్పొరేషన్ చైర్మన్ పదవి కేటాయించారని, జిల్లాలో ఇద్దరు ఎమ్మెల్సీలు,ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలను వన్నికుల క్షత్రియ కులస్తులకు కేటాయించారని తెలిపారు. ఇప్పటికైనా బీసీ కులస్తులు ఏకమై జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.


కిలో బియ్యం ఘనత వైఎస్సార్‌దే



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

ఎన్టీఆర్ కరువు నివారణ కోసం కిలో బియ్యం 2 రూపాయలకు తెస్తే, పేదలను ఆదుకునేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరెడ్డి రూపాయికే కిలో బియ్యం పథకం తెచ్చారని జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు తెలిపారు. ఈ చౌక బియ్యం ధర చంద్రబాబు హయాంలో రూ.5.25కు పెరిగిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమానికి పెద్దపీట వేసి నవరత్నాల పథకాలతో ఇంటింటికీ రూ.లక్షల లబ్ధి చేకూర్చారని తెలిపారు. ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చారని పేర్కొన్నారు. బాబు పాలనకు జగనన్న పాలనకు తేడాను గుర్తించాలని ప్రజలను కోరారు.

కుప్పానికి బాబు చేసిందేమీ లేదు



మాట్లాడుతున్న ఎంపీ రెడ్డెప్ప

35 ఏళ్లుగా కుప్పం ప్రజల ఓట్లతో గెలుపొంది, 14 ఏళ్లు ముఖ్యమంత్రి పని చేసి, దేశంలోనే సీనియర్ నాయకుడని చెప్పుకునే బాబు తనను గెలిపిస్తున్న ఇక్కడి ప్రజలకు చేసింది ఏమి లేదని ఎంపీ రెడ్డెప్ప తెలిపారు. కుప్పంలో అండర్ బ్రిడ్జి నిర్మాణం వైఎస్సార్ సీపీ రాకతోనే కార్యరూపం దాల్చిందన్నారు. కుప్పంను రెవెన్యూ, పోలీసుల డివిజన్లుగా మార్చి కుప్పం అభివృద్ధిపై జగన్‌మోహన్‌రెడ్డి తనదైన ముద్ర వేశారన్నారు. కుప్పంను మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేశారని తెలిపారు.

విద్యుత్ ఉత్పత్తి పెంచిన మంత్రి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఏ రాష్ట్ర మంత్రి విద్యుత్ ఉత్పత్తిని పెంచిన సందర్భాలు లేవని, మొదటిసారిగా విద్యుత్ శాఖ మంత్రిగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఉత్పత్తిని పెంచి దేశానికి ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. వేసవిలో కోతలు లేని కరెంట్ సరఫరా ఇస్తున్నారంటే కేవలం మంత్రి ఘనతని అభివర్ణించారు. కుప్పం అభివృద్ధికి ఏది కావాలన్నా ఇట్టే మంజూరు చేస్తున్న మంత్రికి ప్రజలు రుణపడి ఉంటారని భరత్ చెప్పారు.

సంక్షేమ పథకాలపై జనం సంతృప్తి



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

- ఎమ్మెల్యే వెంకటేగౌడ
- చలమంగళంలో ఆర్బీకే భవనం ప్రారంభం



ఆర్బీకేను ప్రారంభిస్తున్న జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ

పెద్దపంజాణి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. శనివారం మండలంలోని చలమంగళం పంచాయతీలోని చలమంగళం, సూలేరుగుట్ట, చిన్నముద్దేపల్లి, పెదముద్దేపల్లె, కొత్త ముద్దేపల్లె, వడ్డూరు ముద్దేపల్లెలో ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. 640 ఇళ్లను సందర్శించారు. పథకాల లబ్ధిని వివరించి సంక్షేమ బావుటా బుక్‌లెట్లు అందజేశారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. ప్రతి హామీని అమలు చేయడంతో పాటు వివిధ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి అండగా నిలిచినట్లు తెలిపారు. అందుకే గడప గడపకు కార్యక్రమం ద్వారా సగర్వంగా ప్రజల చెంతకు వస్తున్నామన్నారు. రాష్ట్ర చరిత్రలో ఏ ప్రభుత్వ పాలనలోనూ పేద ప్రజలకు ఇంత లబ్ధి చేకూరలేదన్నారు. సాంకేతిక సమస్యలతో పథకాలు అందని వారిని గుర్తించి తక్షణమే లబ్ధి చేకూర్చేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

పాలనను చేరువ చేసేందుకే..

పాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకే ప్రతి గ్రామంలోనూ ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మిస్తున్నట్లు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. చళమంగళం గ్రామంలో సుమారు రూ.22 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి జగనన్న అడుగడుగునా అన్నదాతకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఆర్‌బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులను రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చామని, సాగుకు అవసరమైన సలహాలను నిపుణులతో అందిస్తున్నామని వివరించారు. ఎంపీపీ రెడ్డెప్ప, జెడ్పీటీసీ సభ్యురాలు సుష్మకీర్తి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగా రెడ్డి, వైస్ ఎంపీపీ జీడీ బాబు, సింగిల్ విండో చైర్మెన్ ఓబుల్ రెడ్డి, మాజీ చైర్మెన్ శంకరప్ప, సచివాలయాల కన్వీనర్ పృథ్వి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ ప్రహ్లాద, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు హరినాథ్, కో–ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, ఏఎంసీ డైరెక్టర్ సురేష్, స్థానిక సర్పంచ్ ఫాజిలా, ఎంపీటీసీ సభ్యురాలు నౌహీర, ఎంపీడీఓ శ్రీనివాస విశ్వనాథ్, నాయకులు క్రిష్ణప్ప, లతీఫ్, సన్నప్పరెడ్డి, భాస్కర్‌రెడ్డి, అమరనాథరెడ్డి, రాజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేతో సమస్యల పరిష్కారం



సూచనలు ఇస్తున్న జెడ్పీ సీఈవో ప్రభాకరరెడ్డి



గానుగచింతలో ఇంటింటి సర్వే

శాంతిపురం: అర్హత ఉన్నా ప్రభుత్వ పథకాలు అందుకోలేక పోతున్న వారి కోసం జల్లెడ పట్టి, వారందరికీ లబ్ధి చేకూర్చేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష పథకానికి శ్రీకారం చుట్టిందని జెడ్పీ సీఈవో పి.ప్రభాకర్ రెడ్డి చెప్పారు. ఆరిముత్తనపల్లిలో శనివారం జగనన్న సురక్షపై జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. గ్రామ సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, గృహసారథులు ప్రతి ఇంటినీ సందర్శించాలన్నారు. జగనన్న సురక్ష గురించి వివరించి, వారి సమస్యలను తెలుసుకోవాలని చెప్పారు. ఎంపీడీఓ హేమమాలిని, సర్పంచ్ ఏవీ జయరాం, పంచాయతీ కార్యదర్శులు రవినాయక్, అశ్వర్థనారాయణ, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆదర్శంగా నిలపాలి

జగనన్న సురక్ష కార్యక్రమ అమలులో శాంతిపురం మండలాన్ని ఆదర్శవంతంగా నిలిపేలా అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి రమణారెడ్డి కోరారు. కెనమాకులపల్లె సచివాలయంలో వలంటీర్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి కుటుంబాన్ని కలిసి ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. ప్రతి సచివాలయంలో ఒక రోజు అధికారులు అందుబాటులో ఉండి సర్టిఫికెట్లు జారీ చేయాలని తెలిపారు.

పథకాల అర్హులను గుర్తించాలి

రొంపిచెర్ల: సంక్షేమ పథకాల అమలుకు అర్హులను గుర్తించాలని ఎంపీడీవో రాజేంద్ర అన్నారు. శనివారం గానుగచింత పంచాయతీలో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపికలో ఎక్కడ పక్షపాతం ఉండకూడదన్నారు. ప్రజలు ప్రభుత్వ కార్యాయాల చుట్టూ తిరగకుండా ఇళ్ల వద్దకే వివిధ రకాలైన పథకాలు, సర్టిఫికెట్లను అందజేయాలని తెలిపారు. సర్పంచ్ హేమలత, ఎంపీటీసీ సభ్యుడు రమణయ్య, గృహసారథులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రూ:1.15 లక్షల ఆభరణాల బహూకరణ



ఆభరణాలను అందజేస్తున్న మునెమ్మ కుటుంబ సభ్యులు

చౌడేపల్లె: మండల కేంద్రంలోని బజారువీధిలో వెలసిన శ్రీ అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయానికి తిరుపతికి చెందిన కడియాల మునెమ్మ రూ.1.15 లక్షల విలువజేసే బంగారు ఆభరణాలను బహూకరించారు. శనివారం కుటుంబ సమేతంగా ఆలయానికి ఆమె విచ్చేశారు. స్వామి వారికి విభూధి పట్టీలు, కన్నులును అర్చకులు మహేష్‌కు అందజేశారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేలో వలంటీర్ల బృందం



కాకాతోపులో ఇంటింటి సర్వే

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని కాకాతోపు సచివాలయంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. సచివాలయ సిబ్బంది, వలంటీర్ల బృందం ఇంటింటికీ వెళ్లి అవసరమైన సర్టిఫికెట్ల వివరాలను తీసుకుని, వారికి టోకెన్లను అందించారు. ఎటువంటి ఫీజు లేకుండా జూలై 1న సంబంధిత సచివాలయంలో సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు కమిషనర్ కిరణ్‌కుమార్ తెలిపారు.

జన్‌భాగిదారిలో ప్రతిభ



బహుమతి అందుకుంటున్న చిన్నారి పరిణీత

పలమనేరు: సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో జన్‌భాగిదారి కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలో శనివారం జరిగిన పలు పోటీల్లో పలమనేరు మండలానికి చెందిన ప్రభుత్వ పాఠశాలల పిల్లలు మంచి ప్రతిభను చూపినట్టు ఎంఈవో లీలారాణి తెలిపారు. మండలంలోని సాకేవూరుకు చెందిన పరిణీత నీతిపద్యాలలో, టీఎల్‌ఎం, నృత్యప్రదర్శనలో మంచి ప్రతిభను చూపి బహుమతులు అందుకున్నట్లు పేర్కొన్నారు. ప్రతిభ చూపిన వారిని ఎంఈఓ, హెచ్‌ఎం విజయలక్ష్మి అభినందించారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు వేగవంతం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మెన్ శ్రీనివాసులు

పలమనేరు: పట్టణ సమీపంలోని క్యాటిల్‌ఫామ్ వద్ద జిల్లాలోనే మోడల్ ప్రాజెక్టుగా నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ టమాటా మార్కెట్ పనులను వేగవంతం చేయనున్నట్టు జెడ్పీ చైర్మెన్ శ్రీనివాసులు తెలిపారు. పలమనేరు ఏఎంసీలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, స్థానిక మార్కెట్ వద్ద ట్రాఫిక్ సమస్య తదితరాలపై స్థానిక కమిటీలో శనివారం ఏఎంసీ చైర్మెన్ హేమంత్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ పట్టణ సమీపంలో 33 ఎకరాల్లో నిర్మించనున్న మార్కెట్‌కు ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు వచ్చాయని, త్వరలోనే ఈ పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మెన్ సంజీవకుమార్, సిబ్బంది, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

26, 27 తేదీల్లో అవగాహన సదస్సులు



మాట్లాడుతున్న ఎంఈఓ రెడ్డెన్నశెట్టి

పుంగనూరు: విద్యార్థుల తల్లిదండ్రులకు ఈనెల 26, 27 తేదీల్లో అవగాహన సదస్సులు నిర్వహించి, ప్రభుత్వం విద్యాభివృద్ధికి చేస్తున్న కృషిని వివరించాలని హెచ్‌ఎంలను ఎంఈవో -2 రెడ్డెన్నశెట్టి ఆదేశించారు. శనివారం పట్టణంలోని కొత్తయిండ్లు హైస్కూల్‌లో హెచ్‌ఎంలు, టీచర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాడు–నేడు పనుల పురోగతిపై చర్చించారు. అలాగే జగనన్న గోరుముద్ద, జగనన్న కానుక పంపిణీపై సమీక్షించారు. ఎంఈవో మాట్లాడుతూ పాఠశాలల పరిధిలో బడిమానేసిన పిల్లలను, బాలకార్మికులను గుర్తించి పాఠశాలలో చేర్పించాలన్నారు. విద్యాబోధన విషయంలో ప్రతి ఒక్కరు క్రమశిక్షణకు లోబడి ఉండాలన్నారు. ఉపాధ్యాయులపై ఎలాంటి ఆరోపణలు రాకుండ బోధనపైనే దృష్టి సారించాలని ఆయన సూచించారు. సీఆర్‌పీలు పాల్గొన్నారు.

పుంగనూరులో రూ.6 కోట్లతో మౌలిక వసతులు



పనులను పరిశీలిస్తున్న చైర్మన్ అలీమ్‌బాషా

పుంగనూరు: పట్టణంలోని పలు ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.3 కోట్లు, పార్కు నిర్మాణానికి రూ.3 కోట్లు కేటాయించి, పనులు ప్రారంభించినట్లు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. శనివారం పట్టణంలోని 7వ వార్డులో కాలువల నిర్మాణం, వీధుల్లో సిమెంటు రోడ్ల పనులను చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్ రెడ్డి వార్డు బాట పర్యటనలో ప్రజల నుంచి వచ్చిన వినతులపై స్పందించి మంత్రి పెద్దిరెడ్డి రూ.3 కోట్లను విడుదల చేశారని తెలిపారు. పట్టణంలో అవసరమైన ప్రాంతాల్లో కాలువలు, రోడ్లు, లింకు రోడ్లు, పైపులైన్లు వేసే కార్యక్రమం చురుగ్గా చేపట్టామన్నారు. నెల రోజుల లోపు పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించినట్లు పేర్కొన్నారు. పనుల్లో నాణ్యత పాటించాలని హెచ్చరించామన్నారు. పట్టణంలో సుమారు రూ.3 కోట్లతో పుంగమ్మ చెరువు విస్తర్ణతో పాటు వాకింగ్ ట్రాక్, ఎల్‌ఈడీ దీపాల ఏర్పాటుతో పాటు అత్యంత సుందరంగా పార్కును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు పట్టణ ప్రజలు ఆహ్లాద వాతావరణంలో ఉండేలా పార్కును నిర్మిస్తున్నామన్నారు. ప్రజలకు అవసరమైన సహాయ కార్యక్రమాలు నిర్వహించి, మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చి దిద్దుతామని తెలిపారు.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు



పలమనేరు టమాట మండీలో మాట్లాడుతున్న కార్మికశాఖాధికారి ఓంకార్‌రావు



పుంగనూరు : మాట్లాడుతున్న న్యాయమూర్తి కార్తీక్

పలమనేరు: బాల కార్మికులను పనుల్లో పెట్టుకోకూడదని జిల్లా కార్మికశాఖ అధికారి ఓంకార్ రావు హెచ్చరించారు. పట్టణంలోని టమాటా మార్కెట్‌లోని దుకాణాల్లో శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. బాలలను పనులకు పంపకూడదని తల్లిదండ్రులకు సూచించారు. బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని తెలిపారు. మండీ నిర్వాహకులకు బాల కార్మికుల చట్టంపై అవగాహన కల్పించారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత

పుంగనూరు: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యతని, పనులకు పిల్లలను పంపే తల్లిదండ్రులు అవగాహన కల్పించాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కార్తీక్ అన్నారు. శనివారం మండలంలోని శిికారిపాళ్యంలో బాలకార్మికుల నిర్మూలన వారోత్సవాల సందర్భంగా న్యాయమూర్తి న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ ఇటుకబట్టీలు, వెల్డింగ్ షాపులు, టీ షాపులు, హోటళ్లు, చిల్లర దుకాణాలలో బాల కార్మికులతో పనులు చేయించడం నేరమని తెలిపారు. పనులలో బాల కార్మికులు కనిపిస్తే తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. పిల్లలను పాఠశాలలకు పంపి, వారి ఉజ్వల భవిష్యత్తుకు ప్రతి ఒక్కరు సహకారం అందించాలని కోరారు. సర్పంచ్ సురేంద్రరెడ్డి, డిప్యూటి తహశీల్దార్ హరికృష్ణ, ఐసిడిఎస్ సూపర్ వైజర్ ఆయిషా, వీఆర్‌వో భాస్కర్‌రెడ్డి, కానిస్టేబుల్ వెంకట్రమణ తదితరులు పాల్గొన్నారు.

పటిష్టమైన విద్యకు అంగన్‌వాడీలు మూలం



నియామకపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి

పుంగనూరు: విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన పటిష్టమైన విద్య అంగన్‌వాడీ కేంద్రాల నుంచి లభిస్తోందని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి సిబ్బందికి నియామక పత్రాలను ఆయన అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి రాగానే చిన్నపిల్లలకు క్రమశిక్షణతో కూడుకున్న విద్య, పోషణ పదార్థాలను అందించేందుకు అంగన్‌వాడీలను పటిష్టం చేసిందని తెలిపారు. అంగన్‌వాడీలను ప్రీ ప్రైమరీ స్కూల్‌గా మార్చి, విద్యా బోధన చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, గర్భిణులకు, బాలింతలకు జగనన్న పోషణ పదార్థాలను అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. తద్వారా 5 సంవత్సరాలలోపు విద్యార్థులు చదువుపై దృష్టి సారించి, ఇంగ్లిష్, తెలుగు నేర్చుకోవడంలో ముందుంటున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాజంపేట పార్లమెంటరీ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియామకపత్రం అందజేత

రొంపిచెర్ల: మండలంలోని జాండ్లవారిపల్లె గ్రామ పంచాయతీలో నూతనంగా నియమించిన వలంటీర్‌కు ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి శనివారం నియామకపత్రం అందజేశారు. ఎంపీడీవో రాజేంద్ర, సర్పంచ్ నాగిరెడ్డి పాల్గొన్నారు.

రాగి పంట సాగుతో అధిక లాభాలు

వి.కోట: మామిడి, జామ వంటి పండ్ల తోటల్లో రాగిని అంతర్‌పంటగా సాగు చేస్తే అధిక లాభాలు సాధించవచ్చని చిత్తూరు వనరుల కేంద్ర వ్యవసాయ అధికారిణి లక్ష్మీప్రసన్న సూచించారు. శనివారం మండలంలోని కృష్ణాపురం రైతు భరోసా కేంద్రం పరిధిలోని మద్దిరాళ్ల రైతులకు ఖరీఫ్ సాగుపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఏడేళ్ల లోపు పండ్ల తోటల్లో చిరుధాన్య పంట అయిన రాగిని అంతర్‌పంటగా వేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వం రైతుల నుంచి రాగులను గిట్టుబాటు ధరతో కొంటుందన్నారు. వేరుశనగ వేయని రైతులు రాగి పంటను సాగు చేయవచ్చని తెలిపారు. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు, మందుల వాడకంతో అవసరమైన పోషకాలు అందించడం ద్వారా నాణ్యమైన అధిక దిగుబడిని పొందవచ్చన్నారు.

బాల్య వివాహాలు నేరం

పలమనేరు: బాల్య వివాహాలు చేసే తల్లిదండ్రులతోపాటు, ప్రోత్సహించిన వారిపై కూడా కేసులు తప్పవని సీనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీనివాసరావు హెచ్చరించారు. పట్టణంలోని సబ్ కోర్టులో శనివారం ఆయన జూనియర్ సివిల్‌జడ్జి రవితో కలసి బాల్య వివాహాలతో జరిగే అనర్థాలను వివరించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పలమనేరు: కర్ణాటకలోని కుక్కులదొడ్డి నుంచి అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న పుంగనూరు మండలం వనమలదిన్నెకు చెందిన దామోదర్‌ను అరెస్ట్ చేసి, 43 బాటిళ్ల మద్యాన్ని సీజ్ చేసినట్టు సెబ్ చెక్‌పోస్ట్ సీఐ మాధవస్వామి శనివారం తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్టు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ మస్తాన్‌వలి, సిబ్బంది శ్రీనాథరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

అట్టహాసంగా దుర్యోధన వధ



కార్యక్రమానికి హాజరైన అశేష జనం

కుప్పంరూరల్: కుప్పం మండలం, వెండుగంపల్లెలోని శ్రీద్రౌపదీ ధర్మరాజుల ఆలయ మహాభారత ఉత్సవాల్లో భాగంగా శనివారం దుర్యోధన వధ ఘట్టం అట్టహాసంగా జరిగింది. ఆలయ ఆవరణలో దుర్యోధనుడి ప్రతిమ ఏర్పాటు చేశారు. దుర్యోధనుడు, భీముడు, ద్రౌపది వేషధారులు ప్రతిమ వద్దకు చేరుకున్నారు. అనంతరం దుర్యోధన వధ ఘట్టాన్ని కళాకారులు రక్తికట్టించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి నుంచి కూడా ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అనంతరం రాత్రి ద్రౌపదీదేవి ఉత్సవమూర్తిని ఊరేగించారు. అగ్నిగుండం ప్రవేశం భక్తిశ్రద్ధలతో జరిగింది.